కథ

మొగుడు వీధిలోకి వెళ్లినప్పటినుంచి ఎదలో కొంత అలజడిగానే వుంది ఈశ్వరమ్మకు.

మనస్సు పెట్టి ఏ పనీ చేయలేకపోతోంది.

కొడుక్కి స్నానం చేయించేప్పుడు వాడి ముంజేతి గాయాలకు కట్టిన కట్లు తడవకుండా జాగ్రత్తపడలేకపోయింది.

పొడిగుడ్డతో చాలాసేపు అద్దితేగాని కట్టుగుడ్డ తేమ ఆరలేదు.

కట్టు మార్చాలన్నాడు డాక్టర్.

హాస్పిటల్‌కు తీసుకుపోదామనుకొంటే ఇంటి మగాడు యీరోజే బైటకెళ్లాడు. తిరిగొచ్చేసరికి సాయంత్రమవుతుందేమో! ఇదో మానసిక వేదన.



# వీరనారి

ఇంటి ముందు గోడకాన్చి కట్టిన చిన్న అరుగుమీద కూచుని కొడుక్కి పాలు తాపుతూ సైతం అన్యమనస్కంగానే వుంది ఆమె.

నోటికి పాలు సక్రమంగా అందకపోయేసరికి అప్రయత్నంగానే రెండు చేతులు పైకెత్తి గ్లాసు సర్దుకోబోయి కుర్రాడు బాధగా మూలగటంతో ఉలిక్కిపడి వాడికేసి చూసింది.

ముంజేతుల్ని విదిల్చికొంటున్నాడు వాడు.

గ్లాసు పక్కనబెట్టి కొడుకును సముదాయించింది.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

వాడి చేతుల్ని చూసి ఆమె కళ్ల జల వూరింది.

మూన్నెల్లయింది చేతులకు గాయాలై.

ఇంకా పచ్చి పచ్చిగానే వున్నాయి.

రెండు అరచేతులు ఛిద్రమయ్యాయి. వేళ్ల తెగిపోయాయి.

రెండు ముంజేతుల చివర్లు తెల్లటి ఆసుపత్రి గుడ్డతో కట్టు కట్టబడి... జాగ్రత్తగా చుట్టిన నాటుబాంబుల్లా....

'అవును...అచ్చు నాటుబాంబుల్లాగే...'

ఆమె ఆలోచనల్లో మునిగిపోయింది.

వీధిలో ఒకటీ అరా స్కూటర్లు పరుగెత్తుతున్నాయి.

కూరగాయల తోపుడు బండివాడొకడు ఇళ్లముంగిళ్లను అంగళ్లుగా మారుస్తున్నాడు.

ఇళ్లలోపల తల్లులు తమ పిల్లల్ని కాన్వెంటు సరుకుగా మార్చటంలో తలమునకలవుతున్నారు. పిల్లల చలనశీలతను సాంతం వూడలాగి అటక మీద దాచేందుకు తంటాలు పడుతున్నారు.

అప్పుడే... దూరంగా... గాంధిరోడ్డులోంచి ఏదో పెద్దశబ్దం...

ఒకసారి కాదు... మీద మీద రెండుసార్లు.

ఉలిక్కిపడింది ఈశ్వరమ్మ.

శబ్దాల శైలిని బట్టి అవేమిటో క్షణంలో పసిగట్టేశారు జనం.

"ఎవుర్నో బాంబుల్తో బేసినట్టుంది- కొడుకులు..." ఓమనిషి వ్యాఖ్యానించటంతో చాలామంది గాంధిరోడ్డుకేసి కదిలారు.

ఈశ్వరమ్మ గుండెల్లో సన్నని దడ మొదలైంది.

పాలగ్లాసును కొడుకు నోటికి అందించిందేగాని తను కుదుటబడలేకపోతోంది. ఆమె మెదడునిండా ఆలోచనలు కందిరీగల్లా చుట్టుముట్టాయి.

పక్కపక్క ఇళ్లల్లోని ఆడాళ్లు ఓచోట చేరి గుసగుసలు పోతూ వీధివెంట గాంధీ రోడ్డు దాకా ఎగజూస్తున్నారు. వాళ్లల్లో చేరాలని లేదు ఆమెకు.

బాంబు పేలిన శబ్దం వాళ్లమధ్య రేపిన ఉత్సుకతలో తనూ కొంత భాగం పంచుకొందామని లేదు.

తనలో అంతకంతకూ అధికమవుతోన్న ఆందోళనని వాళ్లకు పంచి పెట్టి తను తేలికపడదామని కూడా లేదు.

మూడు నెలలుగా అదేవీధిలో సంసారముంటున్నా, చుట్టుపట్ల ఆడాళ్లలో మనస్సులు కలిసేంత చనువు పెంచుకోలేదు తను. ప్రయత్న పూర్వకంగానే ఎవరినీ దగ్గరకు రానీలేదు. తనకంత తీరిక కూడా లేదు.

పిల్లాణ్ని జాగ్రత్తగా చూసికోవటం ఒక ఎత్తయితే-

మొగుణ్ని కనిపెట్టుకొని వుండటం మరొక ఎత్తయింది.

గాంధి రోడ్డు నించి వస్తోన్న ఓ స్కూటర్ వాళ్ల దగ్గరగా వీధిలో ఒక్క నిమిషం ఆగింది.

"ఏమబ్బా! ఏంది కత?" చుట్టూ చేరారు అక్కడున్న మనుషులు.

"ఏముంది? బాంబులే..." చెప్పాడు అతను. ఆతృతగా ప్రశ్నించబోతోన్న వాళ్లకేసి చూస్తూ "ఒకటిగాదు రొండు... మంచి ప్లాన్‌తో అటాక్ జేసినారు. అంతలావు మనిషీ స్పాట్ డెడ్... కొట్టినోల్లు మంచి గురికాండ్లే... ఈజీగా మర్డర్ జేసి పొయ్యినారు..." చెబుతూ స్కూటర్ ముందుకు దూకించాడు. వీధిలో శబ్దాలు పెరిగాయి.

మగాళ్లంతా గాంధి రోడ్డుకేసి ఎగబాకారు.

"యీన్నే... సినిమా హాల్ టర్నింగ్‌లో... టీ కొట్టుకాడ... టీ తాగుతాన్నెడంట... బేసినారు..." సైకిల్ ఆపుతూ చెప్పాడు ఇంకో మనిషి.

"ఖూనీ అయిన మాసిది ఏ వూరంటా?" ఆతృత అణచుకోలేక పోయాడు ఓ ముసలాయన.

"ఏమో!"చెప్పాడు సైకిల్ దిగకుండానే". "ఎవురో? ఎవురి మాసో? నిలబడుకొని టీ తాగుతాన్నెడంట... ఒక బాంబుతో యీపున పీకేతలికి గిర గిర తిరిగిండంట. యింగో బాంబుతో పొట్టలో కొట్టినారంట...సచ్చిన మాసి ఖాకీచొక్కా, ఖాకీప్యాంటు తొడుక్కోనుండాడంట..."చెప్పి వెళ్లాడు.

వింటూ వున్న ఈశ్వరమ్మ ఉలిక్కిపడింది.

ఒక్కసారిగా ఆమె గుండె వేగం హెచ్చింది.

ఆదరా బాదరా అరుగు దిగింది.

పాలగ్లాసు ఇంట్లో బెట్టింది. వాకిలేసి పిల్లాణ్ని చంకకు ఎత్తుకొంది.

ఏదో ఉప్పెన వచ్చి తన్ను ముంచుతోన్నంత వూపిరాడని స్థితి కమ్ముకొంది ఆమెను.

'మర్డర్ చేయబడిన వ్యక్తి ఖాకీ డ్రస్‌తో వున్నాడుట'

క్షణం కూడా అక్కడ నిలబడలేక పోయింది.

వీధివెంట విసవిస నడవసాగింది.

మనస్సులో ఓ మూల తర్కించుకొంటూనే వుంది 'తన మగడు ఉదయమే లేచి వెళ్లాడు గదా! ఇంకా టీ కొట్టు వద్ద వుండేందుకు ఏమాత్రం అవకాశం లేదే'ని బహుశా చచ్చింది తన మగడు కాకపోవచ్చు.

సమాధాన పడలేకపోతోంది. కడపకు వెళ్లాలని బైల్దేరాడు.

సక్రమంగా వెళ్లుంటే యీ పాటికి కడప చేరుకొని వుండాలి. కనీసం ఖాజీపేట దాటి పెన్న దరిదాపులకయినా వెళ్లుండాలి.

ఎన్ని రోజులని తను కట్టడి చేయగలదు.

తన చూపులతో అతని పాదాలకు ఎంతకాలమని సంకెళ్లు వేయగలదు.

"బో లావు మాసెబ్బీ! ఉక్కుదూలమంటోడు...రొండు బాంబులగ్గూడా సావలేదని బండెత్తి తలకాయ మీద మోది మోది బుర్ర సితగ్గొట్టినారంట"

అడుగుల వేగం హెచ్చింది ఈశ్వరమ్మకు.

చంకలో పిల్లాడి బరువు కూడా పెరిగింది.

"రింగుల జుట్టు...కోరమీసం...యీ యీధిన్నే యాన్నో సూసినట్టుంది రా!" ఓ యువకుడు చెబుతున్నాడు పక్క స్నేహితునితో.

గుండె ఒక్కసారిగా ఆగిపోయినట్లుగా అన్పించింది యీశ్వరమ్మకు.

కళ్లు బైర్లు కమ్మాయి. తూలి పడబోయి తమాయించుకొంది.

ఒక్కసారిగా ముక్కుపుటాల్నిండా మంట సోకినంతగా దుఃఖావేశం తన్నుకొచ్చింది. చచ్చింది తన మొగుడనే స్పష్టమవుతూ వుంది.

ఆమెకు తెలీకుండానే ఏడుపు పొర్లుకొచ్చింది. నడక పరుగయ్యింది.

ఏడుపు శబ్దం బైటకు ఎగబాకింది. గోడు గోడున శోకిస్తూ పరుగెడుతోన్న ఆమెకేసి వింతగా చూడసాగారు జనమంతా.

దుఃఖావేశంతో తలంతా మొద్దుబారింది ఆమెకు.

కన్నీటి వూటవల్ల చూపులు మసకేశాయి.

ఏడుస్తూ- ఏడుపుకంటే ఎక్కువగా ఆరాటపడుతూ గాంధి రోడ్డెక్కింది.

టీ కొట్టు ముందున్న గుంపుకేసి దూసుకెళ్లింది.

ఎలుగెత్తి ఏడుస్తూ వచ్చిన ఆడదాన్ని- శవానికి సంబంధించిన మనిషిగా సులభంగా అర్థం చేసికొన్న జనం ఆమెకు దారిచ్చారు.

"వీరుడురా యీ యవ్వ... సేతులు సాచి ఎల్లెలకిలా పడి సచ్చిండంటే... వీరుడే..." పౌరుషావేశంతో ఉబికివస్తోన్న కన్నీళ్లను తుడుచుకొంటూ వ్యాఖ్యానిస్తున్నాడు ఓ ముసలాయన.

ఏడ్చుకొంటూ వెళ్లి శవం కాళ్లవద్ద ఆగింది యీశ్వరమ్మ.

చంకలోని పిల్లాడు కిందకు దిగజారాడు.

కళ్లు తుడుచుకొంటూ వంగి శవంకేసి చూసింది.

లావూ, పొడవూ, రింగులజుట్టూ, ఖాకీ డ్రస్సూ...

కనుగుడ్ల వెంట నీళ్లు టపటప రాలాయి.

మరోసారి కళ్లు తడుచుకొంది.

రెప్పలకంటుకొన్న నీటి తడిని సైతం పైటతో అద్దింది.

రక్తసిక్తమై వున్న శవం ముఖం కేసి చూసింది.

మరుక్షణం ఆమె ఏడుపు టక్కున ఆగింది.

గుండెల మీద చేతులేసుకొని "యమ్మ! ... నా మొగుడు గాదులే... నా మొగుడు గాదులే...." అంటూ దీర్ఘంగా నిట్టూరుస్తూ నిటారుగా నిల్చుంది.

జనం కేసి కూడా చూడకుండా పిల్లాణ్ని చంకనెత్తుకొని వెనుదిరిగింది.

ఆమెకేసి వింతగా చూస్తున్నారు జనం.

కొత్తగా చూస్తున్నారు.

ఒకరిద్దరు అడిగారు కూడా " ఏ వీధమ్మా నీది?" అని.

సమాధానమివ్వకుండానే ముందుకు సాగిపోయింది ఆమె.

ఆమెకిప్పుడు శరీరమంతా తేలికగా అన్పించింది.

పూర్తిగా నిర్ధారణ చేసికోకుండానే తన మొగునిగా భ్రమించి ఏడ్చుకొంటూ వెళ్లటం కొంత సిగ్గుగా కూడా అన్పించింది.

గాంధి రోడ్డునించి తమ వీధిలోకి మలుపు తిరిగింది మొదలు తలకూడా ఎత్తబుద్ధి కాలేదు ఆమెకు.

తమ అసలు రంగు జనాలకు తెలిసిపోయినట్లుగా- తమ గుట్టు బహిర్గతమైనట్లుగా అన్పించసాగింది.

ఇంత కాలమూ వీధిలోకి కూడా రాకుండా దాచుకొన్న రహస్య జీవితమేదో అందరికీ అర్థమై వుంటుంది కాబోలు.

అమ్మలక్కలంతా తనకేసి కాకుల్లా చూస్తుంటారు బహుశా.

ఆ భావన వచ్చిందే తడవు కళ్లు పైకి లేవలేదు గాని, చెవులు మాత్రం సునిశితమయ్యాయి ఆమెకు. నడక వేగం కూడా పెరిగింది.

అప్పుడే- దూరాన్నించి సన్నని ఏడుపులాంటి శబ్దమేదో ఆమె చెవలబడింది.

ఏడుపే... సందేహం లేదు... తనకు ఎదురైవ స్తూ...తనలాంటి ఏడుపే... ఎవరో ఆడమనిషి గొంతు. తలెత్తకుండా వుండలేకపోయింది.

తనలాగే గోడుగోడున శోకాలు తీస్తూ...సుడిగాలిలా...

ఆ శోక తీవ్రత ఈశ్వరమ్మను పట్టి కుదిపింది.

తన్ను వదలి ఆమె పైకి దిగిన జనాల చూపుల్ని పట్టించుకోకుండా దారికి అడ్డుగా నిల్చుంది.

రెండు చేతులు పట్టి ఆమెను ఆపింది.

"ఏమ్మా! నీ మొగుడేనా సచ్చింది?" అడిగింది.

సమాధానంగా- పట్టుకొన్న చేతుల్ని విడిపించుకొనేందుకు ప్రయత్నించింది ఆమె గొంతు మరింతగా పెంచుతూ.

"నేనూ నీ యట్లనే- నా మొగుడే సచ్చిండని ఏడుస్తా పోయినా..." చెప్పింది.

కళ్లెత్తి ఈశ్వరమ్మకేసి చూసింది ఆమె.

"తీరా ఆడికిబోయి సూస్తే...సచ్చినోడు నా మొగుడుగాదు. ఎవరో? నువ్వు గుడకా సూసి ఏడ్సు..." చెప్పింది.

చేతులు వదల్చుకొంది ఆమె.

శోక తీవ్రతను ఏమాత్రం తగ్గించకుండా గాంధి రోడ్డుకేసి వెళ్లసాగింది.

చుట్టుపక్కల జనాలు వాళ్లిద్దరి కేసి కొంత ఆశ్చర్యంగా, మరికొంత వింతగా. ఇంకొంత ఉత్సాహంగా కూడా చూస్తున్నారు.

వాళ్ల చూపులు ఈశ్వరమ్మ గుండెల్లో ఎక్కడో నాటుకొని కెలికినట్లుగా అన్పించింది.

అంతదాకా మనస్సులో దోబూచులాడుతూ వున్న సిగ్గరితనమూ, దుఃఖమూ పారిపోయాయి. ఏడుస్తూ వెల్తోన్న ఆడమనిషి చూసి జాలితోటి కోపం కూడా పొర్లుకొచ్చింది.

"ఏం మొగుండ్లో ఏమో! సచ్చింది ఎవురి మొగుడో అర్థం గాదు. యాడ సస్తరో... ఎప్పుడు సస్తరో అర్థం గాదు. బైటికి పోయినోల్లు ఇంటికొచ్చేదాకా సమ్మకం లే...ఏ ఆడమాసి తాలిబొట్టు ఎప్పుడు పుటక్కిమంటదో తెల్దు...యీల్ల పార్టీలు కూలిపోనూ... యీల్ల పెద్దరెడ్లకు వంశాల్లేకుండా పోనూ..." గొంతెత్తి శపిస్తూ ఇంటికి నడిచింది.

ఇంటిముందు అరుగుమీద కూచుని చాలాసేపు తిడుతూనే వుంది.


వీధిలో వాళ్లందరికీ తను కొత్తగా కనిపిస్తూ వుండొచ్చు.

తను- పార్టీ మనిషికి చెందిన ఆడదాన్నిగా అర్థమై వుండొచ్చు.

అన్ని భావనల్నీ తనింతదాకా పడ్డ క్షోభ అధిగమించింది.

ఇన్ని రోజులూ తాను అనుభవించిన మానసిక వేదననంతా తిట్ల రూపంలో కక్కుతూనే వుండిపోయింది.

ఇంతకాలం తనెంత మానసిక వ్యథకు గురయిందనీ!



"వీరుడురా యీ యవ్వ... సేతులు సాచి ఎల్లెలకిలా పడి సచ్చిండంటే... వీరుడే..." పౌరుషావేశంతో ఉబికివస్తోన్న కన్నీళ్లను తుడుచుకొంటూ వ్యాఖ్యానిస్తున్నాడు ఓ ముసలాయన.

ఇంటికొచ్చి కళ్లబడినప్పుడే మొగుడనేవాడు బతికున్నట్టు లెఖ్క.

పార్టీలు వదలమనీ, పెద్ద రెడ్డిను వదలమనీ, పట్టుకున్న బాంబులూ, బాకుల్నీ వదలమనీ, పల్లెకూడా వదలమనీ తను పోరు పెట్టనిరోజే లేదు.

ఎన్నిసార్లో తిట్టాడు, కొట్టాడు.

అయినా తన ప్రయత్నాలు మానుకోలేదు.

చివరకు- దిబ్బలో పూడ్చిన బాంబును ఎల్లేసి, అదేదో ఆటవస్తువుగా భ్రమించి ఆడుకోబోయి, అది పేలి, పిల్లోని రెండు ముంజేతులూ తెగిన తర్వాత గాని ఆ యప్పకు తెలిసి రాలేదు. కొడుకు వైద్యం కోసం టౌను కొచ్చిన వాణ్ని యిక పల్లెకేసి వెళ్లనీలేదు తను.

నెలరోజులపాటు ఇంట్లోంచి బైటక్కూడా కదలనీలేదు.

తనొక్కతే హాస్పిటల్‌కు వెళ్లొస్తూ వుంది.

తమ చిరునామా పెద్ద రెడ్డికి తెలీకుండా జాగ్రత్తబడింది.

మొగుణ్ని షేవింగ్ చేసుకోనీకుండా అడ్డుపడి గడ్డం మీసాలు పెరిగేలా చేసి ఆకృతి మార్చింది.

ఒకటి రెండుసార్లు పెద్దరెడ్డి జీపు హాస్పిటల్ పరిసరాల్లో తటస్థపడింది గాని తను జాగ్రత్తగా తప్పుకొంది.



వాళ్లంత సులభంగా యీ యప్పను వదులుకొనేట్టు లేరు.

సమర్థవంతుడైన డ్రైవర్. ఎన్నో అపాయాల్నించి పెద్దరెడ్డిని చాకచక్యంగా తప్పించిన చరిత్ర వున్నవాడు.

బాంబుల వర్షం కురుస్తోన్నా లెక్క జేయకుండా శత్రు శిబిరాల్లో జొరబడి బ్యాలెట్ బాక్సుల్ని ఎత్తుకొచ్చిన అనుభవం వున్నవాడు.

ఎన్నో మర్డర్లకు సూత్రధారిగా వ్యవహరించిన ఘనత గలవాడు. అన్నిటికీ మించి బాంబుల్ని చుట్టటంలో మంచి నేర్పరితనం సాధించినవాడు.

ఇట్లాంటి మనిషిని వాళ్లెట్లా జారవిడుచుకోగలరు!

అందుకే యీ యప్పకోసం తెగ గాలిస్తున్నారుట.

మరోవైపు- ఇతన్ని మర్డర్ చేస్తే పెద్దరెడ్డి కుడి భుజం పడిపోయినట్లవుతుందని ఎగస్పార్టీ వాళ్ల ప్లానుట. వాళ్లు కూడా కాచుకొని వున్నారని సమాచారం.

మొగుడు ఖూనీ చేయబడితే పూర్వంలా వీరపత్నిగానో, వీరమాతగానో మారేందుకు ఇప్పటి స్త్రీలు ఇష్టపడరనీ, చచ్చిన మొగుని శవాన్ని సైతం కళ్లజూడరనీ, వీలైతే ఇప్పుడుండే తాళిని తెంచి ఫ్యాషన్ తాళికోసం ప్రయత్నిస్తారనీ, దుర్గ పారిపోవటం వెనకవుండే అర్థంగా మొగునికి చెప్పాలనిపించింది. ఈశ్వరమ్మకు.

తనకు ప్రత్యామ్నాయంగా మరో మనిషిని తయారుచేసికొనేదాకా- కనీసం ఓ సంవత్సర కాలమైనా- ఎవ్వరికీ కనబడకుండా దాక్కోమంటే యీ యప్ప వినుకోడు.

ఇలాంటి మరోమనిషి వాళ్లకు దొరికితే సమస్య తీవ్రత బాగా తగ్గిపోతుంది గదా!

ఇంట్లో పొద్దుపోలేదంటూ నెల రోజుల్నించి గాంధి రోడ్డుదాకా వెళ్లొస్తున్నాడు. గంట రెండు గంటల్లోనే తిరిగొస్తున్నాడు గానీ, ఆ కొద్ది సమయాన్ని కూడా గుండెలమీద మోయటం తనకు చేతగాకుండా వుంది.

ఇంతకాలం- యీ వీధికంతటికీ కలిపి ఇలాంటి దౌర్భాగ్యురాలు తనొక్కతే అనుకొంది.

మరో ఆడమనిషి కూడా వున్నట్లు ఇప్పుడర్థమవుతోంది.

ఆమె కష్టాలు ఎట్లాంటివో?

బహుశా చచ్చింది ఆమె మొగుడేనేమో!

తన అనుభవాన్ని ఉదాహరణగా చెప్పినా ఆగకుండా వెళ్లిందంటే... బాగా నిర్ధారణ చేసికొనే బయల్దేరిందన్నమాట.

దిక్కు మొక్కులేనితనంతో శవంమీదబడి మొత్తుకొంటోంది కాబోలు.

అక్కడికి వెళ్లాలనిపించింది ఈశ్వరమ్మకు. వెళ్లి ఓదార్చాలనిపించింది.

మరోవైపు ఏదో అనుమానం... మరేదో గుండెదడ...

తనలాంటి మరో ఆడదానికి కడుపారా ఏడ్చేందుకు కొద్దిసేపు భుజాన్నయినా ఆసరా యివ్వలేకపోతోన్నందుకు బాధ కలిగింది.

తలెత్తి గాంధి రోడ్డుదాకా ఎగజూసింది.

చుట్టుపట్ల అమ్మలక్కల చూపుల్ని ఏమాత్రం లెక్క జేయకుండా తదేకంగా చూడసాగింది.

కొంతసేపటికి ఆమె చూపుల్లో మార్పొచ్చింది.

నొసలు ముడివడి మరింత తీక్షణమయ్యాయి.

దూరాన్నించి వస్తోన్న ఆడమనిషి ఎవరో పూర్తిగా అర్థమయ్యేసరికి ఆశ్చర్యంతో తలమునకలైంది.

ఆమే... ఏడుస్తూ తనకెదురైన ఆడమనిషి.

ఇప్పుడు ఏడ్పుల్లేవు... శోకరాగాల్లేవు.

చచ్చింది ఆమె మొగుడు కూడా కాదేమోననిపిస్తూ వుంది.

ఆమె మొగుడే అయితే శవాన్ని వదలిరాదు గదా!

తనొక్కటే పొరబడిందనుకొంటే.... ఆమెకూడా... తనలాగే...

కొంత వింతగా అన్పించింది ఈశ్వరమ్మకు.

దగ్గరగా వచ్చిన ఆమె మొహంలోకి చూసి మరింత ఆశ్చర్యపోతూ నొసలు ముడేసింది. చచ్చింది తన భర్త కాదని తెలిసినపుడు మొహంలో కొండంత ఆనందం కన్పించాలి.

కనీసం ఒక పెద్ద బరువు దించుకొన్నంత సులువుదనమైనా కన్పించాలి. నిశ్చింత కన్పించాలి.

ఇవేవీ కాకుండా ఆమె కళ్లనిండా శోకానికి మించిన వేదన ఏదో తొణికిసలాడుతోంది.

"ఓమ్మా! ఇట్రా!" పిల్చింది అరుగుమీంచే"

విన్పించుకోలేదు ఆమె.

"చచ్చింది నీ మొగుడూ కాదా?" అడిగింది.

"కాదు... కాదు..."అంటూ పరుగులాంటి నడకతో వెళ్లింది ఆమె. నాలుగిళ్ల అవతల ఓ పెంకుటింట్లో జొరబడింది.

కొంతసేపు అటే చూసింది ఈశ్వరమ్మ.

ఆమెకేదో అనుమానంగా వుంది.

'చచ్చింది ఆమె మొగుడేనేమో!' అన్పిస్తూ వుంది.

'మరెందుకు ఎనక్కి వచ్చినట్లు? ఎందుకు ఏడవనట్లు?'

బహుశా-అయినవాళ్లు ఎవరూ లేక, ఉపద్రవాన్ని తట్టుకొనే శక్తి లేక, ఆత్మహత్యకు సిద్ధపడి వెళ్లోందేమో!

ఆ వూహ వచ్చిందే తడవు వగుడాకులా వణికిపోయింది ఈశ్వరమ్మ.

"తనలాంటి మరో ఆడదాని జీవితం ముగిసిపోబోతోంది'.

అడ్డుకొనే శక్తి తనకు ఉండి కూడా వూరకుండటం అమానుషంగా తోచింది.

ఆదరా బాదరా లేచి వీధిలోకి అడుగేయబోయి ఒక్కసారిగా ఆగింది.

ఎవరికోసమైతే తను వెళ్లబోయిందో, సాక్షాత్తూ ఆ యమ్మే వెనుదిరిగి వీధివెంట వేగంగా వస్తోంది. ఈశ్వరమ్మకు ఏమీ అర్థం కాలేదు.

ఆలోచించేందుక్కూడా పాలు పోలేదు.

వెళ్తోన్న ఆమెకేసి చూస్తూ అరుగుమీద కూచుంది.

గాంధి రోడ్డుకేసి వెళ్లకుండా వీధిలోంచి మరో సందులోకి దూరింది ఆమె. ఐదు నిమిషాల తర్వాత అదే సందులోంచి బైటకొచ్చింది.

ఆమె చేతిలో ఓ కుర్రాడి చేయి వుంది.

వాణ్ని దాదాపు యీడ్చుకొస్తోన్నంత ఆతృతగా నడుస్తోంది.

కాన్వెంటు లోంచి లాక్కొస్తోన్నట్లుంది.

గాంధి రోడ్డుకేసి వెళ్తోన్న ఖాళీ ఆటోను ఆపింది.

తన యింటికేసి చేయిచాచి ఏదో చెప్పింది.

ఆటో రివర్స్ తీసికొని వచ్చేసరికి ఆమె యింట్లోకెళ్లింది.

ఇంటిముందు ఆటో ఆగగానే లోపల సామాను తెచ్చి ఆటోలో పడేసింది.

అంతులేని ఆశ్చర్యంతో వీధిలోకి వచ్చి, మరీ చేస్తోంది ఈశ్వరమ్మ.

దగ్గరికి వెళ్లాలనిపించింది.

సంగతేంటో కొంతయినా తెలుసుకొందామనిపించింది.

అంతలో ఆటో కదిలింది.

వెనక ఎవరో తరుముతోన్నట్లుగా ఓ సందులోకి దూసుకుపోయింది.

లోపలున్న తల్లీ కొడుకుల్దిరూ ఈశ్వరమ్మకు స్పష్టంగా కన్పిస్తూనే వున్నారు.

ఆశ్చర్యపడేందుక్కూడా శక్తి లేనిదానిలా వెళ్లి అరుగుమీద కూలబడింది.

కళ్లు మూసికొని చాలాసేపు గోడకానుకొంది.

తర్వాత ఇంట్లోకెళ్లి మంచమ్మీద వాలింది.

"అమ్మా!.... బువ్వ...."

పిల్లాడు తన ఆకలిని గుర్తు చేయటంతో అన్ని సమస్యల్ని పక్కన పెట్టి లేచి కూచుంది.

చిన్న గిన్నెలో పెరుగన్నం కలిపి కొడుక్కు తినిపించసాగింది.

పొద్దున్నే ఓ అరపావు బియ్యం వండి వుంది.

ఇంటాయన వచ్చేది నమ్మకం లేదు గాబట్టి కూర కూడా చేయబుద్ధి కాలేదు.

ఊరగాయ, పెరుగుతో యీ పూటకు సరిపెట్టుకొందామనిపించింది.

ఇప్పుడు అదీ ఇష్టపడలేదు కడుపులో ఏదో వెగటుగా వుంది.

పిల్లాడి భోజనం తర్వాత ఇద్దరూ మంచంమీద నడుం వాల్చారు.

కొంతసేపు మొగుణ్ని గురించి ఆలోచిస్తూ వుండిపోయింది.

వీధిలో జనాలు ఏవేవో చెప్పుకొంటున్నారు.

వాళ్ల మాటలకు కేంద్రబిందువు తామే అయ్యుంటుంది.

వినాలనిపిస్తూ వుంది. వినటానికి కావలసినంత ధైర్యం కూడ దీసుకొనేంత ఓపిక లేదు. శక్తీ లేదు.

అచేతనంగా అలాగే పడివుంది మంచమ్మీద.

ఓ గంటసేపు కూడా గడచివుండదు. వీధిలో శబ్దమైంది.

తమ ఇళ్లముందరే జీపులాంటి వాహనమేదో ఆగినట్లుంది.

'పోలీసులేమో!'

మంచమ్మీంచి లేచి బైటకు నడిచింది.

అప్పటికే జీపులోంచి పదిమందిదాకా జనం కిందకు దిగి పెంకుటింటి ముందు గుమిగూడి వున్నారు.

వాళ్లల్లో పోలీసులెవ్వరూ కన్పించలేదు.

ఓ వ్యక్తి తలుపుదాకా వెళ్లి వచ్చినట్టుంది తెల్లటి ఖద్దరు దుస్తులు, గుబురు మీసాల మనిషి వద్దకెళ్లి... "బీగమేసుంది..." చెప్పాడు.

"దెంకెల్లినట్టుంది లంజ... యింగా యాడుంటదీ" కోపంగా అన్నాడు మీసాల మనిషి.

"ఆ యింట్లోనో, యీ యింట్లోనో అడిగి సూడండి..." చెప్పాడు.

జనాలు కదిలారు.

ఒక్క నిమిషం కూడా అక్కడ నిలబడదల్చుకోలేదు ఈశ్వరమ్మ.

ఇంట్లోకెళ్లి వాకిలేసికొని మంచమ్మీద వాలింది.

తన యింటివరకు రారనే అనుకొంది.

ఐదు నిమిషాలు కూడా గడవకముందే తలుపు మీద శబ్దమైంది. నొసలు ముడేసి చూసింది.

మళ్లీ శబ్దం...!

"అమ్మా! రొంత వాకిల్దీ..."

కదల్లేదు ఆమె.

మళ్లీ టకటక శబ్దం... మళ్లీ పిలుపు... మళ్లీ... మళ్లీ....

లేవక తప్పలేదు. వాకిలి తీసింది.

ఎదురుగా గుబురు మీసాల మనిషి.

"ఏమన్నా! ఎవురు గావాల?" అడిగింది.


"దుగ్గి... మీరు నైసు మాటల్లో దుర్గ అంటారేమో! ఆ... పెంకుటింట్లో వుంటది. యాడికి బోయిందో సెబుతవా తల్లీ!" అడిగాడు.

"ఏమో! నాకు తెల్దన్నా!"

"తెలుసునని యీదిలోవాల్లంతా సెప్పినారు నాయినా!"

రెండు క్షణాల మౌనం తర్వాత చెప్పింది "ఆటో ఎక్కి పొయ్యింది. అడిగినా సెప్పలే... యాడికి బొయ్యిందోన్నా..."

"అది నా కోడలేమ్మా! సచ్చినోడు నా కొడుకు. పల్లెలో మాకు పార్టీ వుంది. ఆడుంటే మమ్ముల్ను గాదని వాన్నెక్కడ సంపుతారోనని వానికేదో మాయమాటల్జెప్పి టౌనుకు తెచ్చింది. యీడ అడ్డమొచ్చే దిక్కు గుడకా లేక ఎగస్పార్టీవోల్లు సులకనగా సంపిరి. నా కొడుకును అదే సంపిచ్చిందె మ్మా! వాన్నేదో సుగంగా బతికిచ్చుకొందామని గాదు యీడికి దెచ్చింది. పెత్తనంజేసి అది సుగంగా కులుకుదామని... వానిమీద 'యిదు'న్నదయితే వాని శవాన్ని యిడ్సి పోతదే? మొగుణ్ని సంపినోనిమీద కసిబెట్టుకోకుండా పోతదే? తలకొరివి బెట్టేందుకు పిల్లోన్ని గుడకా లేకుండా తీసప్పోయిందే! దానికి మొగునిమీద 'ఇది' యాడుంది తల్లీ! దాని సుద్ది తెలుసుంటే సెప్పు నాయినా. నా మనమన్నయినా తెచ్చుకొంటా. నా కొడుక్కు తల కొరివి పెట్టిస్తా..." గద్గదమయ్యాడు ఆయన.



ఆమెను బతిమాలాడు... బంగపడ్డాడు.

దుర్గ విషయం తనకు తెలీదని ఆయన్ను నొప్పించేందుకు ఈశ్వరమ్మకు కూడా కళ్లనీళ్ల పర్యంతం కావలసి వచ్చింది.

వాళ్లు వెళ్లింతర్వాత మరోసారి ఆలోచనలు చుట్టుముట్టాయి ఆమెను.

'పెద్ద సంసారం లాగుంది. రాజకీయ కుటుంబం కూడా'.

'మరెందుకు దుర్గ పారిపోయినట్లు?'

బైటకు నడిచింది ఈశ్వరమ్మ.

జీపు మనుషులు చేసిన ఎంక్వయిరీ వల్ల దుర్గ సంగతి కొంతలో కొంత అర్థమైనట్లుంది వీధిలో వాళ్లకు.

దాన్ని మరింత విస్తృత పరచుకొని ఏవేవో వ్యాఖ్యలూ, సిద్ధాంతాలూ చేయటం మొదలెట్టారు.

పౌరుషవంతులైన స్త్రీలు భర్తను హత్యచేసినవాన్ని కసిదీరా చంపేదాకా తాళిబొట్టు కూడా తీయరుట.

కసిదీర్చుకొనే శక్తి తమకు లేనపుడు తమ కొడుకులకు ఉగ్గుపాలతోటి పౌరుషాన్ని రంగరించి పోసి, పెంచి, వాళ్ల ద్వారా పగ తీర్చుకుంటారుట. అట్లా పెంచటంవల్ల పిల్లలు కూడా తల్లి కోరిక తీర్చటం తమ బాధ్యతగా భావిస్తారుట.

పారిపోయిన ఆడమనిషి పిరికిపంద కాబట్టి, పైపెచ్చు స్వార్థపరురాలు కాబట్టి కర్తవ్యాన్ని విస్మరించిందట.

వాళ్ల మీద అసహ్యమేసింది ఆమెకు.

దుర్గతో ఒక్కమాట మాట్లాడినందుకే వీళ్లంతా తమను ఒక జాతివాళ్లను చేశారు. ఇద్దరమూ కలిసి ఏడ్చుకొంటూ వెళ్లినందువల్లా, ఆ ఏడ్పులు తమ భర్తలు ఖూనీ చేయబడే స్థాయిలో వున్న విషయం బైటపెట్టడం వల్లా తామిద్దర్నీ ఒకేగాట కట్టారు. తమ కుటుంబాలు రెండూ ఫ్యాక్షన్స్‌కు సంబంధించినవి కాబట్టి తమకు మాత్రమే ఒకరి విషయాలు మరొకరికి తెలుసునన్నట్లుగా వ్యవహరించారు. తమను వాళ్లనించి దూరం చేశారు. ఇంతదాకా- గొడవల్లో వుండే వ్యక్తుల్ని తమలో కలవని ప్రత్యేక పాయగా చూసిన ఈ మనుషులే ఇప్పుడు పౌరుషాన్ని గురించీ, పగ గురించీ, కసి గురించీ, ప్రతీకారాన్ని గురించి ప్రస్తుతిస్తున్నారు.

గొడవలు పడేవాళ్లు పడుతూ వుండాలి. కసి పెంచుకోవాలి. అదను చేసి పగ తీర్చుకోవాలి. వాళ్ల చేష్టలన్నీ వినేందుకూ, చెప్పుకొనేందుకూ, తిట్టేందుకూ, పొగిడేందుకూ, నవ్వుకొనేందుకూ, మంచి కాలక్షేపంగా వుండాలి. పొరబాటున కూడా వాళ్ల చర్యలు తమకు హాని కలిగించకూడదు. తమను అందులోకి లాగకూడదు.

ఒళ్లంతా జుగుప్సతో నిండిపోయింది ఈశ్వరమ్మకు.

అందరికేసి ఓసారి చూసి, కేకరించి వూసి, ఇంట్లోకెళ్లింది.

దుర్గ ఎందుకు పారిపోయిందో తల బద్దలు కొట్టుకొన్నా అర్థంకాలేదు ఆమెకు. ఎక్కడికి వెళ్లుంటుంది? ఎవరి పంచన చేరివుంటుంది?

బహుశా పుట్టింటికి వెళ్లుంటుందేమో!

తల చెడిన ఆడమనిషికి పుట్టిల్లే గదా దిక్కు!

ఆలోచిస్తూ వుండిపోయింది ఆమె.

తను కూడా తన మొగుణ్ని టౌన్లోనే నిలిపి పొరబాటు చేస్తోందేమో!

ప్రత్యర్థులకు అవకాశం కల్పిస్తోందేమో!

తర్కించి చూస్తే- మొగుణ్ని పల్లెకు వెళ్లనీకుండా చేయటంలో తప్పు లేదు గాని, అతన్ని కాపాడుకోవటంలో ఇంకొంత కఠినవైఖరి అవలంబించాల్సిన అవసరం వున్నట్లుగా అవగాహనకు వస్తూ వుంది.

'జాగ్రత్త పడాలి' అనుకొంది.

మొగుడు ఇంకా ఇంటికి రాకపోవటం పట్ల మనస్సులో పెరుగుతోన్న ఆందోళనకు చాలాసేపటిదాకా అడ్డుకట్ట వేయలేకపోయింది.

సాయంత్రంగా పిల్లాణ్ని తీసుకొని హాస్పిటల్‌కు వెళ్లింది.

చేతులకు కట్లు మార్పించింది.

తిరిగి ఇంటికొచ్చేసరికి ఇంటిముందు తచ్చాడుతూ ఓ ముసలాయన.

ప్రశ్నార్థకంగా ఆయనకేసి చూస్తూ తలుపు తీసింది.

"నేను... దుర్గ నాయన్ను తల్లీ!"

తల తిప్పి చూసింది.

ఆయన మొహంలో కనిపించిన దైన్యాన్ని చూసి అలసట తుడుచుకొంటూ "కూకో పెద్దాయనా!" చెప్పింది.

"పొరబాటున నాకేదెన్నా జరుగుతే నువ్వు గుడకా అట్లా పరిగెత్తేవు..." నవ్వుతూ అన్నాడు అతను. "నన్ను సంపినోన్ని సంపేదాకా తాలిబొట్టు తీయగాకు. సంపేదానికి మీకు సేతగాలేదనుకో– పిల్లోన్ని పెద్దయ్యే దాకా సాకి వానిసేత పగ దీర్సుకో. ఫలానావాని పెండ్లాం పిల్లోల్లు పౌర్షవంతులని పేరు రావాల. ఫలానావాని వంశమే మొగుని వంశమని సుట్టుపక్కల అందరూ సెప్పుకోవాలి... ఆ..." చెబుతున్నాడు అతను.

"కూకునేంత పురుసత్తు యాడుండెమ్మా!" పీలగొంతుతో చెప్పాడు.

అల్లుడు నడీధిలో పీనిగై పడుండె. కూతురేమో ఇంట్లోంచి యాడికో ఎల్లబారిపాయె. ఆ యమ్మి జేసిన పనికి...అయినోల్లంతా నామీద వూస్తాండిరి.... మొగుడు ఎట్టాంటోడన్నా గానీ, వాడు సచ్చినాంక వాడు గట్టిన తాలిబొట్టు తెంచాలగద నాయినా! వానికి పుట్టిన పిల్లోని సేత తలకొరివి పెట్టించాలగద సిన్నోడా! అంతో యింతో సదూకున్నెదయివుండి గుడకా ఇటు పుట్టింటికీ, అటు మెట్టింటికీ సెడ్డపేరు దెచ్చె.... అల్లుడు సచ్చినందుకు గాదు...ఇప్పుడీ పిల్ల ఎల్లబారిపోయినందుకే బాధంతా– సెప్పు నాయినా! అమ్మి యాడికి బోయిందీ నీకేమన్నా ఎరికేనా తల్లీ?" అడిగాడు ఆమె కళ్లల్లోకి ఆశగా చూస్తూ.

ఇరుగు పొరుగులే ఆయన్ను తనవద్దకు పంపినట్లుంది.

జరిగిన సంగతంతా ఆయనక్కూడా చెప్పింది ఈశ్వరమ్మ. ఆయన్ను నమ్మించేందుకు చాలా అవస్థలు పడవలసి వచ్చింది.

దుర్గ అట్లా ఎందుకు ప్రవర్తించిందో అర్థం కాలేదంటూ వాపోయాడు ముసలాయన. అల్లుని పెద్దకర్మ రోజుటికయినా ఆమెను వెదకి పట్టుకొని సంప్రదాయం ప్రకారం కార్యక్రమాలు జరిపించి చెడ్డపేరు పోగొట్టుకోవాలన్నాడు.

ఆయన వెళ్లింతర్వాత యీశ్వరమ్మకు మరీ విప్పరాని చిక్కుముడై కూచుంది దుర్గ వ్యవహారం.

చీకటి పడింతర్వాత మొగుడొచ్చాడు.

అతన్ని చూడగానే భోరున ఏడ్చింది ఆమె.


ఇల్లు విడిచి ఎక్కడికీ వెళ్లొద్దంది.

అట్లా తిరగకుండా ఉండలేనట్లయితే యీ వూరు కూడా విడిచి ఎక్కడికయినా దూరంగా వెళ్లిపోదామంది.

ఆమె కళ్లనిండా పొంగుతూ వున్న భయాన్ని చూసీ, ఆమె మాటల్నిండా తొణకుతూ వున్న అభద్రతా భావాన్ని చూసి అతను చిన్నగా నవ్వాడు.

ఉదయం నించి జరిగిన సంఘటనలన్నీ పూస గుచ్చినట్లు చెప్పింది ఆమె.

పార్టీలకు దూరంగా వున్న దుర్గ మొగున్ని ప్రత్యర్థులు చంపటం పట్ల తెగ బాధపడింది.




అతనిలోంచి ఎలాంటి కొత్త భావమూ బైటకు కన్పించలేదు.

"పల్లెలో యీ యప్ప నాయన అవతలి పార్టీవాని కొడుకును సంపించి వుంటాడు. అందుకే వాల్లు యీ మాసిని లేపేసి బాటుకు బాటు చెల్లేశారు..." చెప్పాడు అతి సాదారణంగా.

"యీ యన్న పార్టీకి దూరంగా వుండాడు గదా!"

"వాల్ల నాయన జేసే పార్టీ సాల్దూ..."

చాలాసేపు ఏమీ మాట్లాడకుండా వుండిపోయింది ఆమె.

పార్టీల పరిధుల్ని గురించి ఆలోచించబోయింది గాని సాధ్యంకాక చాలించింది.

భోజనం తర్వాత మొగుని ముందుంచింది తన్నింతదాకా తికమక పెడుతూ వున్న సమస్య– దుర్గ పారిపోవటానికి వెనకున్న కారణాలు ఏమై వుంటాయా? అని.

"అమాయకురాలు...బయపన్నెది..తప్పించుకొని పొయ్యింది. కొడుకును గుడకా చంపి వంశం లేకుండా సేస్తారని బయపన్నెట్టుంది" వెంటనే చెప్పాడు.

ఎందుకో ఆ సమాధానం ఈశ్వరమ్మకు నచ్చలేదు.

"పొరబాటున నాకేదెన్నా జరుగుతే నువ్వు గుడకా అట్లా పరిగెత్తేవు..." నవ్వుతూ అన్నాడు అతను. "నన్ను సంపినోన్ని సంపేదాకా తాలిబొట్టు తీయగాకు. సంపేదానికి మీకు సేతగాలేదనుకో– పిల్లోన్ని పెద్దయ్యేదాకా సాకి వానిసేత పగ దీర్సుకో. ఫలానావాని పెండ్లాం పిల్లోల్లు పౌర్షవంతులని పేరు రావాల. ఫలానావాని వంశమే మొగుని వంశమని సుట్టుపక్కల అందరూ సెప్పుకోవాలి... ఆ..." చెబుతున్నాడు అతను.

ఆమె మౌనంగా వింటూండిపోయింది.



అతను చెప్పటం ఆపిన తర్వాత కూడా వింటూనే వుండిపోయింది.

తెల్లార్లూ నిద్రబోకుండా ఆమె ఏదో వింటూనే వుంది.

దుర్గ ఎందుకు పారిపోయిందో ఆమెకు స్పష్టంగా విన్పించింది.

అదిగో...అందుకే...వీరపత్నిగా...వీరమాతగా...వెరసి వీరనారిగా కీర్తించబడే ప్రమాదం వస్తుందనే....ఆ కీర్తనలు మోసే శక్తి లేకనే...

ఇప్పటినుంచే పగ, ప్రతీకారాల పాటలు పాడిస్తూ, బాంబులు కత్తులతో ఆటలు ఆడిస్తూ కొడుకును వీరపుత్రునిగా తీర్చిదిద్దే వీరమాతగా పరిణత చెందేందుకు శక్తి లేకనే...ఇష్టం లేకనే...

ఒక క్రూరత్వాన్ని....ఒక ఆటవిక లక్షణాన్ని అనువంశికంగా కొనసాగించేందుకు ససేమిరా ఇష్టపడకనే.....

ఎగస్పార్టీవాళ్లు చంపుతారని భయపడి పారిపోయిన పిరికిపందగానే దుర్గను అర్థం చేసికొంటున్నాడు తన మగడు.

మొగుడు ఖూనీ చేయబడితే పూర్వంలా వీరపత్నిగానో, వీరమాతగానో మారేందుకు ఇప్పటి పెళ్లాలు ఇష్టపడరనీ, చచ్చిన మొగుని శవాన్ని సైతం కళ్లజూడరనీ, వీలైతే ఇప్పుడుండే తాళిని తెంచి మరో తాళికోసం ప్రయత్నిస్తారనీ, దుర్గ పారిపోవటం వెనకవుండే అర్థంగా మొగునికి చెప్పాలనిపించింది ఈశ్వరమ్మకు.

తాము చస్తే తమ పౌరుషాన్ని యీ పెళ్లాలు పుణికి పుచ్చుకొని కడదాకా నిలుపుతారనే భ్రమల్లో బతకొద్దని పార్టీల్లో వుండే మగాళ్లందర్నీ హెచ్చరించినట్లుగా దుర్గ చర్యకు అర్థం విప్పాలనిపించింది.

వీరత్వానికి అర్థం మారిపోయిందని కూడా వివరించాలని తహతహగా వుంది.

ఆ ఆలోచన వచ్చింది మొదలు ఆమె శరీరమంతా స్వల్పమైన విద్యుత్ స్పర్శతో పులకించినట్లుగా అన్పించింది. మనస్సు తేలికై ఉల్లాసంగా కూడా అన్పించింది.

దుర్గ పారిపోవటం వెనకవున్న అసలు రహస్యాన్ని మొగునికి విడమరచి చెప్పేందుకు "ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా!" అని ఎదురు చూస్తూ మేలుకొనే వుంది ఈశ్వరమ్మ.

●